
# మళ్ళీ అమరావతి కథలు

## సత్యం శంకరమంచి

## పుణ్యస్నాన

స్నానమాడు తండ్రీ!
కన్నీళ్ళ కాగావు, కష్టాల్లో వేగావు. ఎండల్లో మండావు. వొళ్ళు ఉడికి పోయింది. కళ్ళు కవిలిపోయాయి. సంతత ధారగా తలార నీళ్ళోసుకుని చల్లబడు తండ్రీ! చల్లబడి, ముందుకు చూడు నా తండ్రీ!
హరహర మహాదేవ!
నరహర మహాదేవ!

అల్ల! ఆ నల్లకొండల్లోంచి పరుగు పరుగున వచ్చిందయ్యా కృష్ణమ్మా! నెమలి పింఛపు ఛాయ చీర మట్టాబెట్టి




పాల కొంగల ఛాయ పట్టు రైకాకట్టి
లోయలో జాలుగా బారుజడ వేసికొని
కొండ పుప్పొడి తేనే వాడిలోన
వొంపుకొని కోనపక్షుల రవముకొంగులో
కప్పు కుని
వాగుల్ల వంకల్ల రాసుకుంటూ, దూసు
కుంటూ
గట్టుపుట్టల మీంచి గబగబా దూకుతూ
అందెల్లు ఘల్లుమన
మట్టెల్లు ఝల్లుమన
ఝణఝణా
ఫెళఫెళా
గలగలా
నరనరా
ఉరకలతో పరుగులతో తరలి వచ్చిందయ్యా కృష్ణమ్మ.

ఆ వొడ్డు ఈ వొడ్డు అంతనీ తాకుతూ
అమ్మ తల్లిలా,
అలల చేతులు అన్ని వైపులా విప్ప, తూ
పిలుస్తోందయ్యా కృష్ణమ్మ!

స్నానమాడు తండ్రీ!
శాంతించు తండ్రీ!
ఓ హరుడా!
ఓ వరుడా!

అన్ని పుణ్య నదులకు ఆత్మలా వచ్చిందయ్యా వాహిని.

రాత్రి ఏమి నిద్రపోయావో! ఏ వెద్దకల వచ్చిందో! గతమెంత జీర్ణమయిందో! లే తండ్రీ! లే! లేచి స్నాన మాడు.

కాళ్ళు కడుక్కునే నీళ్ళు, దాహమాపే నీళ్ళు, వొళ్ళు నిమిరే నీళ్ళు, వల్లబరిచే నీళ్ళు దోసిళ్ళపట్టే అక్షయంగా తెచ్చానయ్యా! లే!

అప్పుడే కృష్ణ వొడ్డున ఆడంగులు స్నానాలు చేస్తున్నారు. మొగవాళ్ళు లోతుకి వెళ్ళి ఈతలు కొడ్తున్నారు. పిల్లలు కోసురాళ్ళ మీంచి ఎగిరెగిరి దూకుతున్నారు. కొత్తగా కాపురాని కొచ్చిన వైదేహి ఇంకా రాలేదు. 'అత్తగారు కృష్ణకొచ్చి అరగంట దాటిందే! వైదేహి ఇంకా రాలేదేమా!' అని ఎదురుమాస్తున్న రాధకి గబగబా తొట్రుపడుతూ వస్తున్న వైదేహి కన్పించింది. వైదేహి నరాసరి నిలువు లోతులో స్నానం చేస్తూన్న రాధ దగ్గరకెళ్ళింది.

''ఇంతాలస్యం అయిందేం?'' అంది రాధ.

''ఇంటి పని'' అంది వైదేహి.

రాధ సూటిగా వైదేహి ముఖంలోకి మాసింది. అమ్మ దొంగ! దొరికి పోయింది.

''మీ అత్తగారు బయటకొచ్చాక మీ ఆయన ఇప్పటి దాకా వుండి ఇప్పుడే కదూ పొలం వెళ్ళాడు'' అంది రాధ.

వైదేహి తెల్లబోయి సిగ్గుతో ముకుళించుకు పోయింది.

''కొత్త పెళ్ళి కూతురివి నరేగాని, నీ ముఖం మీద తోకముక్కలా వెరిగిపోయిన బొట్టు అసలు కథంతా చెప్పేస్తోంది'' అంది రాధ.

సిగ్గు పట్టలేక బుడుంగున నీళ్ళలో మునిగింది రాధ. నీళ్ళ అడుగున ఎంత సిగ్గుతో ముడుచుకపోయిందో, ఎంత ముసి ముసి నవ్వులు నవ్వుకుందో ఆ కృష్ణమ్మకే తెలియాలి.

వందల మంది ముత్తయిదువులు, మొగవాళ్ళు స్నానాలు చేసి శుభగాత్రులయి ఎవరి పనులకు వాళ్ళు వెళుతున్నారు. మువ్వా తనివితీరా తలారా స్నానం చెయ్యి తండ్రీ! చేయవలసిన పని చేతులనిండా వుంది.

పరుచుకుంటున్న సూర్య కిరణాల్లా లోకంలో నవ్వులు విచ్చిస్తున్నాయి. పొద్దున్నే ఇసకలో ఆడుకుంటున్న పిల్లలు, ఇసక చిట్టి గుప్పిట్లతో పట్టి ఒకరి మీద ఒకరు విసురుకుంటూ కిలకిలా నవ్వుతున్నారు.

# గాథావళి

## యతిప్రాసలు

ఏలూరు సాహిత్యమండలివారి కార్యక్రమంలో ఒకసారి వెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారితో పాటు వారి ప్రియ శిష్యులు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు కూడా పాల్గొనడం తటస్థించినది. శ్రీ విశ్వనాథ సభాధ్యక్షులు.

ఆ సభలో శ్రీ పిలకా గణపతిశాస్త్రి "అమ్మా! మాధవ కవళం" అన్న గేయాన్ని గానం చేయగా, అది కవిత్వం కాదని శ్రీ వెళ్ళపిళ్ళ వెంటనే ఆక్షేపించారు.

అది యతిప్రాసలు సరిగా లేని గేయమన్నది వారి విమర్శ. అయితే సభాధ్యక్షులైన శ్రీ విశ్వనాథ వెంటనే లేచి, 'రావే రంభాఘృతాచి రావే' అన్న గురువుగారి పద్యంలో కూడా యతి పోయిందని అధిక్షేపించారు.

కాబట్టి యతి ప్రాసలను గురించి అంతగా పట్టించుకోనవసరం లేదని చెపుతూ వారు గణపతి. శాస్త్రిగారిని సమర్థించారు.

సభాముఖంగా శిష్యుడు తనను అధిక్షేపించినప్పటికీ వెళ్ళపిళ్ళవారు కిమ్మనలేదు. వారి శిష్య వాత్సల్యం అలాంటిది.



[కవిసామ్రాట్ శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి అముద్రిత. జీవిత చరిత్ర పుటలనుంచి గ్రహింపబడినది]

—జొన్నలగడ్డ వెంకటరత్నం

---

ఇసకలో ఒకర్నొకరు కింద పడవేసుకుంటూ ప్రపంచాన్ని జయించిన వీరుల్లా పొంగి పొంగి నవ్వుతున్నారు. వాళ్ళని చూసి అప్పుడే విచ్చిన పువ్వులు నవ్వుతున్నాయి. ఆ పక్క శ్రీదేవి తులసికోట దగ్గర కూర్చుని తనలో తనే మురిసిపోయి నవ్వుకుంటోంది. కాపురాని కొచ్చి పదేళ్ళయినా కడుపు పండలేదు. అత్త మామల సాధింపు లయ్యాయి. ఆడబిడ్డల ఈసడింపులయ్యాయి-నిన్ననే నిన్ననే తెలిసింది తను తల్లి కాబోతున్నట్టు. అత్త మెచ్చుకుంది. ఆడబిడ్డ అలంకారాలు చేసింది. ఇక భర్త సరే సరి. శ్రీదేవి కడుపు నిమురుకుంటూ, పుట్టబోయే బిడ్డని తలుచుకుంటూ ముసి ముసిగా తృప్తిగా, నవ్వు కుంది. తులసి దళాలు గాలికి వూగిపోయాయి.

అన్నదమ్ములూ, తోడికోడళ్ళూ పెద్ద పండగ జరుపుకుంటున్నట్లు ఆ వరండాలో ఒకటే నవ్వులు. ఆ రెండు కుటుంబాలు విడిపోయి పదేళ్ళయింది. వాళ్ళ మధ్య మాటల్లేవు. పిలుపు లంతకన్నా లేవు. ఒకే రక్తం పంచుకున్న వాళ్ళు బద్ద శత్రువులయిపోయారు. అన్న ఇంట్లో శుభకార్యం పదేళ్ళ ఇనుపతెరని ముక్కలు ముక్కలు చేసింది.

'వాడు పిలుస్తే వస్తా'నన్నాడు తమ్ముడు.

"దానికేం పిలుస్తా"నన్నాడు అన్న. పిలిచాడు. వచ్చాడు. కలిసి పోయారు. పదేళ్ళ కబుర్లన్నీ ఒక్క రోజు లోనే చెప్పు కోవాలని కాబోలు ఒకటే మాటలు. వాళ్ళ అయ్యకాలం జ్ఞాపకం తెచ్చుకున్నారు. కలిసి మెలసి ఒకళ్ళ ముద్ద ఒకళ్ళు అందుకున్నట్టు వరస నవ్వులు.

దీపావళి పండుగనాడు రాముడు తారాజువ్వలు కాలు స్తుంటే విశాలమైన చాతీ వైపు, పొడవాటి చేతులవైపు ఆశగా తలుపుచాటు నించి చూస్తున్నది ప్రమీల. అలా చూస్తున్న ప్రమీలని తనూ చూడాలని ఉన్నట్టుండి చిచ్చుబుడ్డి వెలిగిస్తే ఆ వెలుగులో తన కోసం వెలిగిం చిన దీపకాంతిలో పట్టుచీర కొంగుచాటునించి ప్రమీల నవ్విన నవ్వు. ఆ నవ్వు కోసమేగా రాముడు మర్నాడే పెళ్ళి ముహూర్తం నిశ్చయించమని తొందరబెట్టింది.

లక్ష్మి సంక్రాంతికి గొబ్బెమ్మలు పెడ్తూ పాట ఆఖరి చరణం "మొగలీ పూవంటి మొగుణ్ణివ్వావే" అనంగానే చెలులు చెప్పకుండా వాళ్ళ బావని తీసుకొచ్చి అక్కడ నుంచో పెడితే లక్ష్మి పళ్ళెం అక్కడే వొదిలేసి, చెంగున గెంతటమూ, తీసిన పరుగూ చూడవలసిందే. ఇంట్లో కెళ్ళి ఆయాసంతో చెయ్యి గుండెమీద వేసుకుని సిగ్గుతో నవ్వుకున్న ఆ నవ్వో!

ఆ నవ్వులన్నీ కోసుకొచ్చానయ్యా!

ఇటు నవ్వులు. అటు కన్నీళ్ళు!

సంతలో గొడ్లమ్మబోయిన కొడుకు రౌడీ తగాదాల్లో ఇరుక్కోగా డబ్బు దోచుకుని కొడుకుని హతమార్చి కాలవలో పారేశారని విన్న క్షణం నించి సూరమ్మ కన్నీటికి అడ్డం వున్నదా? ఏ ఓదార్పు ఆ తల్లికి తిరిగి కొడుకు నివ్వగలదు?

లంకకు గొడ్లు తోలుకుపోయిన భర్త వరద ముంపుకు బలైపోగా బొట్టు మీద బొట్టు మెత్తుకున్నదేగాని ఆ ఇల్లాలు చూపు లంక మీంచి తిప్పిందా?

కళ్ళు ధారలవటం మానాయా?

తాత తండ్రులు కట్టిన ఇల్లు, పెళ్ళి పేరంటాలు జరిగిన ఇల్లు, పాపలుయ్యాల లూగిన ఇల్లు, అప్పు కింద తాకట్టైపోగా ఇల్లు విడిచిపోతున్న పంతులుగారు ఇంటి బయటకొచ్చి ఒక్కసారి ఇంటివైపు చూసినప్పుడు జారిన అశ్రుకణమో! మళ్ళీ ఆ గడపకి పసుపు రాసుకునే యోగ్యత లేదని పంతులుగారి భార్య గడపకి పసుపురాసి బొట్టు పెట్టి మొక్కుతున్నప్పుడు ఆమె కన్నీటికి చెరిగిన కుంకుమ రేఖలో

ఏటి కేడాదీ భార్యా పిల్లలతో సహా ఆ పొలంలో పనిచేసి, రక్తం ధారపోసి పంటలు పండిస్తే, ఉన్నట్టుండి ఒక్కరాత్రి పంటంతా తుఫాను మింగేస్తే, గట్టునున్న రైతులం, తల్లీ! ఇదేనా నాయం! పిల్ల పెళ్ళి చేద్దామనుకున్నానే! ఇంటిదానికి కడియాలు కొందామనుకున్నానే! పెళ్ళీ లేదు కడియాలు లేవు. ఆఖరికి అన్నం కూడా లేకుండా చేశావా అమ్మా" అంటుంటే

ఆ రైతు కళ్ళంట రాలిన కన్నీళ్ళకు భూమి బద్దలవదో!

ఆ నవ్వుల్ని, ఆ కన్నీళ్ళని కలబోసి తెచ్చాను తండ్రీ!

ఆ నవ్వులు నీవు విన్నవే!

ఆ కన్నీళ్ళు నీవు చూసినవే!

ఆ రెంటినీ కలిపి నా రెండు చేతులా నీ కర్పిద్దామని వచ్చానయ్యా! తెచ్చానయ్యా నూటొక్క బిందె వాసెన గట్టి! మోసుకుంటూ వచ్చానయ్యా దూరదూరాల నించి? అగాధాలు తవ్వి!, అంతరంగాలు తొలచి ఆకాశ గంగని, పాతాళగంగని కలబోసి ఒకేజాలుగా మళ్ళించి, స్వచ్ఛంగా నా గుండె పంటగా ప్రవహింప చేశానయ్యా!

లే తండ్రీ! లే!

తలార తనివితీర స్నానమాడు!

స్నానమాడి

శాంతించు నరుడా!

దీవించు హరుడా!

హరహర మహాదేవ!

నరహర మహాదేవ!